# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

గురువారం 03 07 2025

సంపుటి 1 సంచిక 64

పేజీలు : 03

UDYAM / TS-09-0148996



విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఆసక్తి గల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్
ఆర్.సీ. ఇన్చార్జులు
మండల రిపోర్టర్లు
క్రైమ్ రిపోర్టర్లు

దశ నిజం.. నిర్భయంగా.. PRESS ప్రత్యేక ప్రతినిధి తెలంగాణ

Off. Add.: H. No. 2-1-131/97, 1st floor, Rd no 6, Venkatramana Colony, Nagol, Hyderabad -TG - 500068.

www.DASHANEWS.com

(మీ వివరాలను వాట్సప్లో పంపగలరు)

73375 46647




## పాపికొండల యాత్రకు బ్రేక్

గోదావరి నదికి వరద ఉద్ధృతి పెరుగుతున్న నేపథ్యంలో పాపికొండల విహారయాత్రను నిలిపివేస్తూ జలవనరులశాఖ ఆదేశాలు జారీ చేసింది. గోదావరిలో నీటిమట్టం పెరుగుతున్న కారణంగా ముందస్తు జాగ్రత్తగా ఈ..నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. యాత్ర ప్రారంభమయ్యే తదుపరి తేదీని త్వరలోనే వెల్లడిస్తామని వివరించింది.

దశ, కొత్తగూడెం



## నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ప్లాస్టిక్ కాలుష్యం యొక్క తీవ్రమైన సమస్యలు భూమి నుండి సముద్ర జీవుల వరకు సహజ పర్యావరణానికి దాని వల్ల కలిగే తీవ్రమైన ముప్పు గురించి అవగాహన పెంచడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు.


వివరాలు 2లో






## ఆర్థిక గతిని మార్చేసిన జీఎస్టీ

ఎనిమిదేళ్ల తరువాత 2025లో జీఎస్టీ విధానం దేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన పన్ను సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తోందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధిని పెంపొందించేందుకు విలువ ఆధారిత పన్నులు (వ్యాట్) స్థానంలో జీఎస్టీని ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అప్పటి నుంచి నేటి వరకు జీఎస్టీ సాధించిన కొన్ని విజయాల గురించి తెలుసుకుందాం.


వివరాలు 3లో


## జేఎన్టీయూలో ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ ప్రారంభం

జేఎన్టీయూ వర్సిటీ లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి నేటి నుండి కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించారు అధికారులు. దీనిలో 16 స్లాట్లలో రోజుకు 1000 మంది విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ బాలు నాయక్ వెల్లడించారు. కౌన్సిలింగ్ కి వచ్చే విద్యార్థులకు అన్ని ఏర్పాట్లను చేశామని ఆయన అన్నారు.

దశ, హైద్రాబాద్



# అంత వీజీయేం కాదు...!

**జి ఎచ్ ఎం సి ఎన్నికల్లో బలమైన ప్రదర్శన చేయడం రామచందర్‌రావు ఎదుర్కొనే సవాల్**

**స్థానిక స్థాయిలో పార్టీ బలాన్ని పెంచడంపై దృష్టి అవసరం**

**దశ, హైదరాబాద్:** తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికలు ఎట్టకేలకు నిర్వహించారు. కొత్త సారథిగా మాజీ ఎమ్మెల్యే ఎన్. రామచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, సీనియర్ నాయకులు రామచందర్‌రావును అభినందించారు. శుభాకాంక్షలు తెలిపారు. బీసీ నినాదం వేళ.. ఓసీ నేత తెలంగాణ సారథి కావడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. మరోవైపు కొత్త సారథికి పార్టీలో సరికొత్త సవాళ్లు ఎదురుకాబోతున్నాయి.తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన ఎన్. రామచందర్‌రావు ముందు రాజకీయ సవాళ్లు, అవకాశాలతో కూడిన కీలక బాధ్యత ఉంది. రాష్ట్రంలో మూడు నెలల్లో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన విజయాలను కొనసాగిస్తూ, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం సాధించాలన్న బీజేపీ అధిష్టానం ఆకాంక్షలను నెరవేర్చాల్సి ఉంది. పార్టీలోని అసంతృప్తులను సమన్వయం చేస్తూ, క్షేత్రస్థాయిలో సంస్థాగత బలోపేతం చేయాల్సి ఉంది.ఎవరు అనువన్నా.. కాదనా్న.. బండి సంజయ్ బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక పార్టీకి గణనీయమైన మైలేజీ వచ్చింది. గణనీయమైన పురోగతి సాధించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1 సీటు సాధించిన బీజేపీ, 2023లో 8 అసెంబ్లీ సీట్లు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లతో 35.08% ఓటు షేర్‌ను సాధించింది. ఈ విజయాలను స్థానిక సంస్థల ఎన్నికలైన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగించడం రామచందర్‌రావు ముందున్న తొలి సవాలు. వచ్చే ఏడాది జరిగే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గతానికన్నా బలమైన ప్రదర్శన చేయడం రామచందర్‌రావు ఎదుర్కొనే మరో సవాల్. ఇందుకోసం, స్థానిక నాయకులను బలోపేతం చేయడం, హిందుత్వ ఎజెండాతోపాటు అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలను సమతుల్యం చేయడం అవసరం. తెలంగాణలో వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ కలిసి పోటీ చేసే అవకాశం ఉందని కొంతమంది రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రామచందర్‌రావు నియామకం వెనుక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితిలో కుదిరితే పొత్తు పెట్టుకోవడం.. లేదంటే విపక్షాలను చిత్తు చేయాల్సిన ఎత్తులు వేయాల్సిన బాధ్యత రామచందర్‌రావుపై ఉంది. ఈ సమీకరణాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, స్థానిక స్థాయిలో పార్టీ బలాన్ని పెంచడంపై దృష్టిసారించాలి.



# హెల్త్ టూరిజం హబ్ గా మారిన తెలంగాణ రాష్ట్రం : సీఎం

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం హెల్త్ టూరిజం హబ్‌గా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 66 దేశాల నుంచి వచ్చే రోగులకు వైద్య సేవలందించే స్థాయికి ఎఐజి చేరుకుందని ప్రశంసించారు. ఎఐజి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో సత్కారించాలని డిమాండ్ చేశారు. అ తెలంగాణ ముఖ్యమంత్రి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఎఐజి ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎఐజి ఆస్పత్రి సేవలు ఇంకా విస్తరించాలని, హెల్త్ టూరిజంలో ప్రభుత్వానికి నాగేశ్వర్ రెడ్డి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో తయారయ్యే బల్క్ డ్రగ్‌లో 35 శాతం హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతుందని రేవంత్ వెల్లడించారు. ఐడిపిఎల్ మాజీ ఉద్యోగుల కృషితోనే ఫార్మారంగం అభివృద్ధి చెందిందని ప్రశంసించారు. క్యాన్సర్ చికిత్సలో నోరి దత్తాత్రేయ సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని, క్యాన్సర్ వల్ల మహిళలు ఎక్కువగా ఇబ్బంది పడు తుండడంతో వారి ఆరోగ్య వివరాలు నమోదు చేస్తామని రేవంత్ స్పష్టం చేశారు. సామాజిక బాధ్యతగా ఏడాదిలో ఒక్క నెల రోజులు ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యులు పని చేయాలని కోరారు. జనని మిత్ర యాప్ పేద రోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నిమ్స్‌లో అదనపు బ్లాక్, ఎల్‌బి నగర్, సనత్‌నగర్‌లో ఆస్పత్రులు నిర్మిస్తున్నాని సిఎం తెలియ జేశారు. మిస్ వరల్డ్ వనితలను ఎఐజి ఆస్పత్రి సందర్శించాలని తాను సూచించానని పేర్కొన్నారు.

# రూ. కోటి పరిహారం: సిగాచి

దశ, హైదరాబాద్ : సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం జరిగిన మూడు రోజుల తర్వాత ఎట్టకేలకు కంపెనీ స్పందిస్తూ కీలక ప్రకటన చేసింది. సిగాచి ప్రమాదంపై స్టాక్ మార్కెట్లకు కంపెనీ సెక్రటరీ వివేక్ లేఖ రాశారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందజేస్తామన్నారు. పరిహారంతో పాటు అన్నిరకాల బీమా క్లెయిమ్స్‌ను చెల్లిస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి పూర్తి వైద్య సాయం అందిస్తామని, కుటుంబపోషణను తామే చూసుకుంటామని సిగాచి సెక్రటరీ వివేక్ కుమార్ తెలిపారు .ప్రమాదంలో 40 మంది మృతి చెందారని, మరో 33 మందికి గాయాలు అయినట్లు చెప్పారు. ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామన్నారు. ప్రమాదం నేపథ్యంలో మూడు నెలల వరకు ప్లాంట్ పనులు నిలిపివేస్తామని సిగాచి యాజమాన్యం ప్రకటించింది. కాగా.. నిన్న (మంగళవారం) పాశమైలారంలో ప్రమాద స్థలిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సిగాచి కంపెనీపై కఠిన చర్యలు తీసుకుంటామని, మానవీయకోణంలో చనిపోయిన వారి కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆ కోటి రూపాయలను కంపెనీ ద్వారా బాధితులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే 48 గంటలు గడిచినప్పటికీ కంపెనీ ఎండీ ఘటనా స్థలికి రాకపోవడంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈ క్రమంలో ఈరోజు సిగాచి కంపెనీ పత్రికా ప్రకటనను విడుదల చేసింది. చనిపోయిన కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వడంతో పాటు క్షతగాత్రులకు వైద్య ఖర్చులను తామే భరిస్తామని సిగాచి యాజమాన్యం పేర్కొంది.



## పాశమైలారానికి మీనాక్షి నటరాజన్

పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర అగ్నిప్రమాద స్థలాన్ని ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బుధవారం సందర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను మంత్రి దామోదర్ రాజనర్సింహను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు తగిన న్యాయం కల్పించాల్సిందిగా నేతలు కోరారు.

## బంగారు బోనంతో బల్కంపేటకు ఊరేగింపు



**దశ, సికింద్రాబాద్:** షాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా సప్తమాతృకలసప్త బంగారు బోనం సమర్పణలో భాగంగా భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న దేవాలయం లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వివిధ కళాకారుల నృత్యాల నడుమ భాజా భజంత్రీల తో జోగిని నిషా క్రాంతి. నృత్యాల తో బల్కంపేట రేణుక ఎల్లమ్మ అమ్మవారి దేవాలయానికి మూడవ బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు. ఓడిబియ్యంతో బయలుదేరారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ మాట్లాడుతూ ప్రజలు సుఖశాంతులతో పాటు పాడి పంటలు పచ్చగా ఉండాలని కోరుతూ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నామన్నారు.

## ఇల్లు కట్టు _ మేకపోతు పట్టు

- **అర్హులైన పేదలకు ఇళ్లు: మంత్రి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
- **రెండు నెలల్లో 3500 ఇండ్లు: ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**
- **మొదటి లబ్ధిదారునికి యాటపోతు , పట్టుబట్టలు బహుకరించిన బీర్ల**



**దశ, యాదగిరిగుట్ట:**గ్రామంలో ఎవరైతే త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుని తొలి లబ్ధిదారునిగా నిలుస్తారో వారికి గృహప్రవేశం రోజున మేకపోతు, పట్టు వస్త్రాలు బహుకరిస్తానన్న మాటను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బుధవారం నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామమైన సైదాపురం లో తొలిగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశం చేసిన ఎగ్గిడి స్వప్న బాలమల్లేష్ దంపతులకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా పట్టువస్త్రాలు, మేక పోతును బహూకరించారు. రిబ్బన్ కట్ చేసి మంత్రి గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. పాలు పొంగించి, పూజలు చేసి ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిన బీ ఆర్ ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో విఫలమై ప్రజలను మోసగించిందని అన్నారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన పద్దెనిమిది నెలల్లోనే ఇందిరమ్మ ఇళ్లు కట్టించి పేదోడి సొంతింటి కలను నిజం చేస్తోందన్నారు.

## ఘనంగా " ఘన " బర్త్ డే వేడుకలు



**దశ, మెదక్ :** జంతువులను ప్రేమించడమే కాకుండా తమ కుటుంబంలో ఒకరిగా చేర్చుకొని మొదటి జన్మదిన వేడుకలు మెదక్ జిల్లా తూప్రాన్ లో ఘనంగా నిర్వహించారు. నేటి సమాజంలో ఒకరికి ఒకరు తోడు నీడగా ప్రేమమయా జీవితం గడిపే రోజులు అంతరించిపోతున్న సమయంలో ఏకంగా తమ పెంపుడు కుక్క కు "ఘనా" అని నామకరణం చేయడమే గాకుండా దాని ఆలనా పాలన చూస్తూ ఏడాది నిండిన కారణంగా ఘనా యజమాని తూప్రాన్ కు చెందిన గూడూరి శేఖర్ గౌడ్, శిరీషలు దంపతులు జులై 1నాడు వారి దగ్గరి బంధుమిత్రులను ఆహ్వానించి మొదటి సంవత్సర జన్మదిన వేడుకలు ఘనా కు నూతన వస్త్రాలు ధరించి, కళ్ళజోడు పెట్టీ బర్త్ డే కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ శిక్షణ అందించి జన్మదినం సందర్భంగా గూడూరి శేఖర్ గౌడ్, శిరీష లు ఆశీర్వదించి దీవించామన్నారు.



## చరిత్రలో ఈ రోజు

**1910:** తెలంగాణలో విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన రావిచెట్టు రంగారావు మరణం. (జ.1877)
**1918:** తెలుగు సినిమా నటుడు ఎస్వీ రంగారావు జననం. (మ.1974).
**1914:** నిజాం నిరంకుశ పాలన వ్యతిరేక ఉద్యమకారుడు విశ్వనాథశర్మ జననం.
**1924:** తత్వవేత్త, చిత్రకారుడు, రచయిత, కవి సూర్యదేవర సంజీవదేవ్ జననం.(మ.1999)
**1927:** తెలుగు రచయిత, బలివాడ కాంతారావు జననం (మ. 2000).
**1928:** కర్ణాటక సంగీత విద్వాంసురాలు, దక్షిణ భారత చలనచిత్రరంగంలో నేపథ్యగాయని ఎం. ఎల్. వసంతకుమారి జననం.(మ.1990) (చిత్రంలో)
**1980:** భారత క్రికెట్ జట్టు క్రీడాకారుడు హర్భజన్ సింగ్ జననం.

# నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం




**దశ, రంగారెడ్డి:** అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని ప్రతిసంవత్సరంజులై 3నప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ప్లాస్టిక్ కాలుష్యం యొక్క తీవ్రమైన సమస్యలు భూమి నుండి సముద్ర జీవుల వరకు సహజ పర్యావరణానికి దాని వల్ల కలిగే తీవ్రమైన ముప్పు గురించి అవగాహన పెంచడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్లాస్టిక్ సంచులు కుళ్ళిపోవడానికి దాదాపు 100500 సంవత్సరాలు పడుతుంది కాబట్టి అది పల్లపు ప్రదేశాలలో పారవేయడం వలన భూమి కాలుష్యాన్ని సృష్టిస్తుంది. అది సముద్రాలలో కొట్టుకుపోతే సముద్ర జంతువుకు ప్రమాదకరమని నిరూపించబడింది. ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ సంచుల దుష్ప్రభావాలకు వ్యతిరేకంగా హెచ్చరికలను జారీ చేయడం అత్యవసరం.

బ్యాగ్ ఫ్రీ వరల్డ్ ఆర్గనైజేషన్ అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డేను స్థాపించింది. ఈ సంస్థ ప్లాస్టిక్ రహిత ప్రపంచాన్ని ప్రోత్సహించే అనేక ప్రచారాలను ప్రవేశపెట్టింది, ఇది ప్రపంచంలోని ఇతర ప్రాంతాలను ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డేలో పాల్గొనడానికి ప్రేరేపించింది. జీరో వేస్ట్ యూరప్ సభ్యుడైన రెజెరో, జూలై 3, 2008న మొదటి అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డేను ప్రారంభించారు. 2015లో యూరోపియన్ యూనియన్ కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని తగ్గించడానికి కొన్ని ఆదేశాలను ఆమోదించింది. 2022లో అధికారికంగా సింగిల్ యూజ్, సన్నని ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని నిషేధించిన మొదటి దేశంగా బంగ్లాదేశ్ నిలిచింది. ఆ తర్వాత వెంటనే, భారతదేశంతో సహా అనేక దేశాలు కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాయి.



### ప్లాస్టిక్ సంచులను వాడటం మానేయండి

ప్లాస్టిక్‌కు బదులుగా కాగితాన్ని లేదా క్లాత్ సంచులను ఎంచుకోవడం ప్రారంభించండి. లేదా మీరు వస్తువులను తీసుకోవడానికి రిటైలర్ల వద్దకు మీ స్వంత సంచులను తీసుకువెళ్ళండి. కొన్ని దుకాణాలు తమ సొంత సంచులను తెచ్చే కస్టమర్లకు డిస్కౌంట్లు లేదా ఇతర ప్రోత్సాహకాలను కూడా అందిస్తాయి!

### మీ సొంత బ్యాగ్ తయారు చేసుకోండి

ఈ రోజుతో కనెక్ట్ అవ్వడానికి మరొక ఎంపిక మీ స్వంత బ్యాగ్‌ను తయారు చేసుకోవడం. మీరు ఆన్‌లైన్‌లో చూస్తే, మీ స్వంత బ్యాగ్‌ను తయారు చేసుకునే సలహాలను సూచనలను అందిస్తాయి. దీని ద్వారా మీరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవడమే కాకుండా, మరెవరికీ లేని ప్రత్యేకమైన బ్యాగ్‌ను కూడా తయారు చేసుకోవచ్చు. మీ శైలి మరియు మీ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడానికి ఇది సరైన మార్గం. మీరు మీరే తయారు చేసుకున్న బ్యాగ్‌ను మీతో తీసుకెళ్లడం పట్ల మీరు గర్వంగా భావిస్తారు.

### కస్టమర్లను ప్రోత్సహించండి

మీకు ఒక దుకాణం ఉంటే, మీ కస్టమర్లు వారి స్వంత పునర్వినియోగ కంటైనర్లను తీసుకురావడానికి ప్రోత్సహించడానికి ప్లాస్టిక్ సంచులను అందించడం మానేయడానికి ఒక కార్యక్రమాన్ని ప్రారంభించండి.

### మీరు ఈ రోజున చేయగలిగే కొన్ని పనులు:

మీరు ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించడానికి ప్రయత్నించండి.. బట్ట సంచులు లేదా ఇతర రీసైకిల్ చేయగల సంచులు ఉపయోగించండి.
ప్లాస్టిక్ కాలుష్యం గురించి అవగాహన కల్పించండి.
మీ స్నేహితులు మరియు కుటుంబ సభ్యులతో ఈ విషయం గురించి మాట్లాడండి.
స్థానిక స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేయడంలో పాలుపంచుకోండి.

# వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

❖ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచన



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అత్యవసరమైతే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలు పొందాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన జిల్లాలోని నదులు వాగులు వంకలు చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తూ రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉందని తెలిపారు. కాలి నడకన వాహనాలతో ప్రజలు రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో కలిసి ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు చెరువులు వాగులు నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి జిల్లా పోలీస్ శాఖ తరపున 24 ఇంటూ 7 అందుబాటులో ఉండే విధంగా డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని తెలిపారు. ప్రజలు ఎవరైనా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లయితే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు. ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు విజ్ఞప్తి చేశారు.

# శిధిలావస్థలో ఓపెన్ జిమ్!

❖ పనికిరాకుండా ఉన్న పరికరాలు
❖ పరిసర ప్రాంతాల్లో కాళీ మద్యం సీసాల దర్శనం
❖ కనిపించని పచ్చదనం శుభ్రత
❖ అధికారులు పట్టించుకోవాలని విజ్ఞప్తి




**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం సెంటర్లో గతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఓపెన్ జిమ్ శిధిలావస్థకు చేరుకుంది. ఇందులో ఉన్న వ్యాయామ పరికరాలు శిథిలావస్థకు చేరి పనికిరాకుండా దర్శనమిస్తున్నాయి. కూర్చునే బల్లలు కూడా విరిగిపోయి కనిపిస్తున్నాయి. పచ్చదనంతో కళకళలాడాల్సిన ఓపెన్ జిమ్ వెలవెలబోతుందని రామవరం ప్రాంతానికి చెందిన కొంతమంది ఆవేదన వ్యక్తం చేయడం జరుగుతుంది. లక్షల రూపాయలు వెచ్చించి ప్రజా ఆరోగ్యం కొరకు ఏర్పాటు చేసిన జిమ్ పనికిరాకుండా ఉందని పలువురు పేర్కొంటున్నారు. సాయంత్రం సమయంలో కొంతమంది ఆకతాయిలు ఓపెన్ జిమ్ లోకి ప్రవేశించి మద్యం సేవించి కాళీ సీసాలను అక్కడే వదిలేస్తున్నట్లుగా కొంతమంది స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యాయామశాలకు సంబంధించిన కొంత స్థలం సైతం ఆక్రమణకు గురైనట్లు కూడా ఆరోపణలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిధిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఓపెన్ జిమ్ కు మరమ్మత్తులు నిర్వహించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.




# బొగ్గు ఉత్పత్తి రికార్డులో కొత్తగూడెం ఏరియా

❖ ఏరియా జీఎం ఎం.షాలేం రాజు

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం సింగరేణి ఏరియా 20252026 ఆర్థిక సంవత్సరానికి గాను జూన్ నెలకు కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించబడిన 11.27 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 12.23 లక్షల టన్నులు ఉత్పత్తిచేసి 109 శాతం ఉత్పత్తిలక్ష్యాన్ని సాధించడం జరిగిందని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేం రాజు తెలిపారు. అదేవిధంగా 202526 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి జూన్ నెల వరకు 37.40 లక్షల టన్నులకు 38.29 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 102 శాతం ఉత్పత్తి లక్ష్యంసాధించామని రోడ్డు రైల్ ద్వారా 13.75 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందని 202526 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి జూన్ నెల వరకు 41.94 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందని అలాగే నూతనంగా అనుమతులు వచ్చిన వీకే ఓసి ప్రాజెక్ట్ పనులు అతి త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. బుధవారం సింగరేణి కొత్తగూడెం ఏరియాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియా ఇప్పటి వరకు 668 వారసులకు కారుణ్య నియామకాల క్రింద ఉద్యోగ అవకాశాలు కల్పించటం జరిగిందన్నారు. 72 మందికి ఉద్యోగం బదులు ఏక మొత్తం చెల్లించటం జరిగిందని చెప్పారు. ఒకరికి నెలవారి భృతి మంజూరు చేసినట్లుగా తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం(202425)లో 10 లక్షల వరకు ఇంటి రుణంపై వడ్డీని కొత్తగూడెం ఏరియా 315 దరఖాస్తులకు గాను 60 మందికి ఇంటి రుణంపై వడ్డీని ఇవ్వడం జరిగిందని మిగిలిన 255 మందికి సరైన పత్రాలు సమర్పించినచో మంజూరు పత్రాలు అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంతో పాటు ఎస్. ఓ.టు జీఎం జి.వి.కోటి రెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణరాజు, ఏజీఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, ఏజీఎం(ఫైనాన్స్) కే.హాన సుమలత, డిజిఎం(పర్సనల్) జివి.మోహన్ రావు, డిజిఎం(ఐఈ) ఎన్.యోహన్, ప్రాజెక్టు ఆఫీసర్ జికేఓసి, ఎం.రమేష్, డిజిఎం(ఈ అండ్ఎం), టి.శ్రీకాంత్, డివైపిఎం హరీష్ గోవర్ధన, సింగరేణి సేవ సమితి కోఆర్డినేటర్ సాగర్ పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కన్ను పడిందా.... విగ్రహాలు మాయం







❖ కరుడుగట్టిన ఇద్దరు దొంగలు అరెస్టు
❖ ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాలయాల్లో దొంగతనాలు
❖ పక్కా సమాచారంతో నిందితులను అరెస్టు చేసినసీసీఎస్ ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం పోలీసులు
❖ వివరాలు వెల్లడించిన సీపీ సుధీర్ బాబు

**దశ, ఎల్బీనగర్ :** వీరి కన్నుపడితే ఆలయంలో చోరీ పక్కా. ఆలయంలోని పంచలోహ విగ్రహాలు, గుడి గంటలు, దీపాల స్టాండ్, హుండీలు, ఆభరణాలను చోరీ చేస్తారు. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని దేవాలయాల్లో విగ్రహాలను చోరీ చేస్తున్న కరుడుగట్టిన ఇద్దరు దొంగలతోపాటు చోరీ సొత్తును కొనుగోలు చేస్తున్న స్క్రాప్ దుకాణం నిర్వాహకుడిని అరెస్టు చేసి, మొత్తం రూ. 5,36,300 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎల్బీనగర్ లోని రాచకొండ పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాలయం లో సీపీ సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు.

ఏపీ లోని కర్నూల్ కు చెందిన కరాచ శివానంద(52) హైదరాబాద్ లోని వనస్థలిపురంలో నివసిస్తున్నాడు. ఏపీ లోని ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్ కే హమ్ షరీఫ్(38) హైదరాబాద్ లోని ఎల్బీనగర్ లో నివాసం ఉంటున్నాడు. శివానంద, షేక్ హామ్ షరీఫ్ కూలీ పనులు చేస్తుండగా లేబర్ అడ్డాల వద్ద పరిచయం పెరిగి, స్నేహితులుగా మారారు.

ఇద్దరూ తాగుబోతులు... డబ్బు అవసరం కావడంతో దొంగతనాలు చేయాలని ప్లాన్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామాల్లో ఆటో అద్దెకు తీసుకుని తిరగడం ప్రారంభించారు. ఫిబ్రవరి 27న యాచారం మండలం గండ్లగూడలోని మల్లికార్జున, శివాలయాల్లో చోరీ చేశారు. జూన్ 15న ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరగూడలోని మల్లన్న స్వామి ఆలయంలో దొంగతనం చేశారు. జూన్ 24న ఉప్పల్ లో బైక్ దొంగతనం చేశారు. చోరీ చేసిన బైక్ పై ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో తిరుగుతున్నారు. జూన్ 29న అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సద్దుపల్లిలోని హనుమాన్ ఆలయం, ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాలు దొంగిలించారు. జూన్ 30న ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లిలో శివగంగ, హనుమాన్ ఆలయాల్లో పంచలోహ విగ్రహాలు, బంగారు మంగళసూత్రాన్ని దొంగిలించారు.

జులై 2న విశ్వసనీయ సమాచారం మేరకు సీసీఎస్ ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం పోలీసులు ఉదయం 8:30 గంటలకు మంగల్ పల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీరిని విచారించి, మొత్తం రూ. 5,36,300 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చోరీ చేసిన వస్తువులను ఉప్పల్ లో స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్న అక్కపల్లి క్రాంతి కుమార్(31) కు విక్రయించేవారు. నిందితుల్లో శివానంద్ పై గతంలో కేసులు ఉన్నాయి. షేక్ హామ్ షరీఫ్ పై పాత కేసులు లేవు. వీరిద్దరిపై ప్రస్తుతం యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్ మెట్, ఉప్పల్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

చోరీ కేసులను ఛేదించిన పోలీసులు, సిబ్బందిని సీపీ సుధీర్ బాబు అభినందించారు. సమావేశంలో సీసీఎస్ ఎల్బీనగర్ ఇన్ స్పెక్టర్లు ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్.విజయ్ కుమార్, సబ్ ఇన్ స్పెక్టర్లు అశోక్, అనిల్, రవికుమార్, ఏఎస్సై విద్యాసాగర్, కానిస్టేబుళ్లు తస్లీం, బాలకృష్ణ, రమేశ్, రాజ్ కుమార్, సుధీర్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, రాజు, ఈశ్వర్, జవహర్‌లాల్, శేఖర్, ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ చందర్ సింగ్, కానిస్టేబుళ్లు కోటేశ్వర్ రావు, కె.చంద్రశేఖర్, బి.రాజు, ఎన్.నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మా ఇండ్లను కాపాడాలి

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కోరిన బైరామల్ గూడ బస్తీవాసులు**



**దశ, ఎల్బీనగర్ :** మా ఇండ్లను కాపాడాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని బుధవారం బైరామల్ గూడ చెరువు పక్కన నివాసం ఉంటున్న పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దాదాపు 30 నుంచి 40 సంవత్సరాలుగా మేము అక్కడ నివాసం ఉంటున్నామని, ఇటీవల ఇండ్లను తొలిగిస్తున్నట్లు అధికారులు చెప్పారని తెలిపారు. ఈ నేపథ్యంలో మా ఇండ్లను కూల్చకుండా కాపాడాలని కోరారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... మీ ఇండ్ల జోలికి ఎవరూ రారని హామీ ఇచ్చారు. మీ నివాసాల ముందు గతంలో బాక్స్ డ్రైన్స్ నిర్మాణాలు పూర్తి చేశారని గుర్తు చేశారు. ఎవరూ ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, నిర్భయంగా ఉండాలని... తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి ఎవరికి నష్టం రాకుండా చూసుకునే బాధ్యత తనదని సుధీర్ రెడ్డి తెలిపారు.



## ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం: కమిషనర్ సత్యనారాయణరెడ్డి

**దశ, ఇబ్రహీంపట్నం:** ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నామని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నానని స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కారం దిశగా ముందుకు వెళ్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని డ్రైనేజీ వీధి దీపాలు రోడ్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. కొంతమేర డ్రైనేజీ సమస్య ఉన్నప్పటికీ ఉన్నత ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో వందరోజుల ప్రణాళికను తూచా తప్పకుండా పాటిస్తున్నామని అన్నారు. ఈరోజు ప్లాస్టిక్ దినోత్సవం కావడంతో ప్రజలకు ప్లాస్టిక్ పట్ల జరిగే అనర్థాలను వివరిస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. తడి పొడి చెత్తను వేరువేరుగా వేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలను పరిష్కారం చేస్తామని అన్నారు.

## 'సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి'



**దశ, పెద్ద అంబర్ పెట్ :** కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని ఈనెల తొమ్మిదో తారీఖున దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర ఆచారి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ముత్యాల యాదిరెడ్డి లు కోరారు. ఏఐటీయూసీ అబ్దుల్లాపూర్ మెట్టు మండల సమితి కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా బుధవారం రావి నారాయణరెడ్డి కాలనీ సిపిఐ పార్టీ కార్యాలయం ఆవరణలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్, ఫిక్స్డ టర్మ్, అప్రెంటిస్, థర్డ్ పార్టీ, ట్రైనీలుగా పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26,000 అమలు చేయాలి, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి, ఎన్ పి ఎస్ , యూ పి ఎస్ ను రద్దు చేయాలి, స్కీమ్ వర్కర్స్ కి కనీస వేతనం ఈఎస్ఐ, పి ఎఫ్, గ్రాటిట్యూటీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి, వ్యవసాయ ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర చట్టం చేయాలి, ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించి సంవత్సరానికి 200 రోజుల పని రోజుకి 600 వేతనం ఇవ్వాలి, అనే పలు కార్మికుల డిమాండ్ ను సాధించాలనే సంకల్పంతో ఏఐటీయూసీ ఇతర కార్మిక సంఘాల ఐక్య పోరాటం చేయాలనీ పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేతరాజు నర్సింహా, మండల అధ్యక్షులు దాసరి ప్రసాద్, మండల నాయకులు యేశాల నర్సింహా, నవనీత, అరుణ,బాల్ రెడ్డి, రాములు, మధు రాము,హైమద్,బాల్ రెడ్డి,బిచ్చు, యాదగిరి సైదులు ముదిరాజ్, మంగళపల్లి రవి, ముత్తయ్య, దేవమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు

## స్కూటర్ డిక్కినుంచి ఆరు లక్షల నగదు చోరీ

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని మలక్‌పేట్ గంజ్ ప్రాంతంలో షాకింగ్ ఘటన జరిగింది. వ్యాపారవేత్త షేక్ ఖుద్దూస్ తన ఇంట్లో ఉన్న ద్విచక్ర వాహనం డిక్కీలో రూ.6.5 లక్షల నగదును దొంగలు రెప్పపాటులో కాజేశారు. తన దుకాణానికి వెళ్లి ఆయన తిరిగి వెనక్కి వచ్చాడు. అయితే ద్విచక్ర వాహన డిక్కీలో పెట్టిన నగదు కనిపించలేదు. దీనిపై చాదర్‌ఘాట్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశాడు. సీసీటీవీలో బురఖా ధరించిన మహిళపై అనుమానం వ్యక్తమవుతోంది.



## ఆషాఢ మాసం గోరింటాకు సంబురాలు

**దశ, ఎల్బీనగర్ :** ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు సంబురాలు ప్రారంభమయ్యాయి. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్ కార్యాలయంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ కాటా విజయ గౌడ్ ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా నాయకులు కొప్పెర శ్యామల, నూకల పద్మారెడ్డి, పోరెడ్డి కవితారెడ్డి, రాజేశ్వరి, రజిత, వైజయంతి, లావణ్య, సంగీత, అరుణ, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## సరూర్ నగర్ డీడీఆర్సీ కేంద్రంలో సేవలు అద్భుతం

**రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వీరయ్య**




దశ, ఎల్బీనగర్ : సరూర్ నగర్ లోని డీడీఆర్సీ కేంద్రంలో దివ్యాంగులు అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య ప్రశంసించారు. బుధవారం సరూర్ నగర్ లోని డీడీఆర్సీ కేంద్రాన్ని ఆయన సందర్శించి, అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం అధికారులు, వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. మేధో వైకల్యం, ఆటిజం, స్పెక్ట్రమ్ డిజార్డర్, సెరిబ్రల్ పాల్సీ, మల్టిపుల్ డిజేబిలిటీస్, ఏడీహెచ్‌డీ, లెర్నింగ్ డిజేబిలిటీస్, లోకోమోటర్ డిజేబిలిటీస్, డౌన్ సిండ్రోమ్ తో బాధపడు తున్నవారికి ఎలాంటి చికిత్స అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. డిజేబిలిటీ, క్లినికల్ సైకాలజీ, స్పీచ్ థెరపీ, సమగ్ర పునరావాస సేవలు, చికిత్సా సేవలపై చైర్మన్ సంతృప్తి చెందారు. నేషనల్ ట్రస్ట్ సహకారంతో యూడీఐడీ కార్డులు, నిరామయ ఆరోగ్య బీమా కార్డులను జారీ చేస్తామని తెలిపారు. సరూర్ నగర్ డీడీఆర్సీ కేంద్రానికి నిధులు కేటాయించాలని

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



**దశ, ఎల్బీనగర్ :** కొత్తపేట డివిజన్ లోని శ్రీశంకర్ కాలనీలో రూ, 25 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ పనులకు బుధవారం కార్పొరేటర్ పవన్ కుమార్ శంకుస్థాపన చేశారు. కమ్యూనిటీ హాల్ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్ కు సూచించారు. కార్యక్రమంలో ఏఈ షరీఫ్, వర్క్ ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కాలనీ సంఘం అధ్యక్షుడు కృష్ణ, సభ్యులు రమేష్ చారి, విద్యాసాగర్, నాగేశ్వర్ రావు, రమేశ్, భాస్కర్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్.. ప్రొడక్షన్ నెం.2 ప్రారంభం



**పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెం. 2 గా నిహారిక కొణిదెల నిర్మిస్తున్న చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించనున్నారు. ఈ చిత్రానికి కథను మానస శర్మ అందించగా.. స్క్రీన్ ప్లే, డైలాగ్స్‌ను మానస శర్మ, మహేష్ ఉప్పాల అందించారు. ఈ మూవీకి మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాల్ని బుధవారం నాడు అన్నపూర్ణ స్టూడియోస్ గ్లాస్ హౌస్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుకకు ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్, కళ్యాణ్ శంకర్, మల్లిది వశిష్ట వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.**

## దేశపు పన్ను సంస్కరణల చరిత్రలో ఒక విప్లవాత్మక మలుపు

# జీఎస్టీ

వస్తు, సేవల పన్ను భారత దేశపు పన్ను సంస్కరణల చరిత్రలో ఒక విప్లవాత్మక మలుపు. ఎనిమిదేళ్ల తరువాత 2025లో జీఎస్టీ విధానం దేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన పన్ను సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తోందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధీకరించడం, పారదర్శకతను పెంచడం, వృద్ధిని పెంపొందించేందుకు విలువ ఆధారిత పన్నులు(వ్యాట్) స్థానంలో జీఎస్టీని ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అప్పటి నుంచి నేటి వరకు జీఎస్టీ సాధించిన కొన్ని విజయాల గురించి తెలుసుకుందాం. ఒకే దేశం, ఒకే పన్ను. జీఎస్టీ అమలు ద్వారా 17 వేర్వేరు పన్నులు, 13 సెస్‌లను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. దాంతో గతంలో రాష్ట్రాల్లో ఉన్న పరోక్ష పన్నుల భారం తొలగిపోయింది. ఈ సమన్వయం ఒక ఉమ్మడి జాతీయ విధానాన్ని సృష్టించింది. లాజిస్టిక్స్ ఖర్చులను గణనీయంగా తగ్గించింది. రాష్ట్రాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేసింది. ప్రతి సంవత్సరం జులై మొదటి తేదీని వస్తు సేవల పన్ను దినోత్సవంగా దేశంలో పాటిస్తున్నారు. ఇది దినోత్సవం మాత్రమే కాదు, కేవలం ఒక పన్ను విధానం ఆవిర్భావ మోడళ్ల మధ్య పలికిన భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఓ సుస్థిర మార్గాన్ని ఏర్పరిచిన ఘట్టం. దేశవ్యాప్తంగా పన్నుల పరంగా అనేక జరుగుతున్న గందరగోళానికి ముగింపు మలుపు. వస్తు సేవల పన్ను అమలుకు దారితీసిన అవసరాలు ఎన్నో. కొంతకాలం క్రితమే మన దేశంలో విక్రయపు పన్ను, ఎక్సైజ్ సుంకం, సేవలపై పన్ను, రాష్ట్రాల మధ్య వ్యాపార లావాదేవీలపై వేర్వేరు పన్నులు, ప్రవేశపు పన్ను వంటి అనేక రకాల పన్నులు అమలులో ఉండేవి. రాష్ట్రానికి ఒక విధానం, మరో రాష్ట్రానికి మరో విధానంతో వ్యాపార రంగం సంక్లిష్టతలతో కొట్టుమిట్టాడేది. దేశ వ్యాప్తంగా సమగ్ర వ్యాపార వాతావరణం ఏర్పడలేకపోయింది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా ఒకే విధమైన పన్ను విధానాన్ని రూపొందించారు. దీని ఫలితంగా దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలులోకి వచ్చింది. దీనివల్ల పన్నుల వ్యవస్థసరళతరం అయింది. వ్యాపారులు పన్నుల వివరాలు సమర్పించడంలో నూతన సాంకేతిక పద్ధతులను ఉపయోగించటం ప్రారంభించారు. ఈ పన్ను విధానం మూడు భాగాలుగా విభజించబడింది. తయారీదారునుండి తుది వినియోగదారుని వరకు ప్రతి దశలో విధించబడే పన్నును తక్షణమే ముందుగానే చెల్లించిన పన్నుతో సమన్వయం చేసుకునే అవకాశం కల్పించబడింది. దాని వల్ల ఒకే వస్తువుపై పన్ను మీద పన్ను విధించే పరిస్థితి లేకుండాపోయింది. ఈ విధానంలో కేంద్రానికి ఒక భాగం, రాష్ట్రానికి మరో భాగం లభించేలా పన్ను వసూలు జరుగుతుంది.అంతర్రాష్ట్ర వ్యాపార లావాదేవీలపై ప్రత్యేకంగా మరోవిధానంలోవసూలు జరుగుతుంది.దీనివల్లరాష్ట్రాలమధ్యవస్తువులరవాణాసులభతరమైంది. వాణిజ్యానికి ఆటంకాలు తొలగిపోయాయి.ప్రస్తుతం ఈ పన్ను విధానం నాలుగు ప్రధాన శ్రేణులుగా విభజించ బడింది. అవసరమైన నిత్యావసర వస్తువులకు తక్కువ శాతం, విలాస వస్తువులకు ఎక్కువ శాతం విధించబడుతున్నాయి. దీనివల్ల సామాన్యులపై భారం తగ్గించబడి, విలాస వస్తువుల వినియోగంపై నియంత్రణ సాధించబడుతోంది. ఈ పన్ను విధానం ప్రారంభం తరువాత ప్రభుత్వ ఆదాయ వనరులు గణనీయంగా పెరిగాయి. 2024 25 ఆర్థిక సంవత్సరంలో పన్ను ద్వారా వచ్చిన ఆదాయం 22.08 లక్షల కోట్ల రూపాయలకుపైగా ఉండటం గమనించదగినది.ఇది పాలనా సామర్థ్యాన్ని సూచించడమే కాదు, పన్ను చెల్లింపులో పారదర్శకతను, ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. అయితే, దీనిలో కొన్ని సవాళ్లు ఇప్పటికీ ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వ్యాపారులు ఈ పద్ధతిలో పూర్తిగా స్థిరపడలేకపోతున్నారు. పన్ను వేదికపై సాంకేతిక సమస్యలు, ఖాతాల సర్దుబాటు లోపాలు, ఎంటరైన పన్ను మొత్తాన్ని తిరిగి వాడుకునే అవకాశాలపై చిక్కులు, తరచూ మారే నిబంధనలు వీటన్నీ వ్యవస్థపై కొంత అస్పష్టత కలిగిస్తున్నాయి. వస్తు సేవల పన్ను దినోత్సవం అనేది ఈ విధానంపై ప్రజలలో అవగాహన పెంపు, ప్రయోజనాలపై చర్చలు, విధాన బలాలపై మద్దతు, లోపాలపై పరిష్కారాలకు మార్గదర్శనం చేసే సందర్భంగా పరిగణించాలి.కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్రాలు, పరిశ్రమల సంఘాలు, వాణిజ్య మండలాలు ఈ దినాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించడం ప్రాశస్త్యం. ఈ విధానం ద్వారా దేశీయ పెట్టుబడులే కాకుండా, విదేశీ పెట్టుబడులకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడింది. వ్యాపారానికి అనువైన విధానంగా దీన్ని అంతర్జాతీయంగా గుర్తిస్తున్నారు. మొత్తంగా ఇది కేవలం పన్ను విధానం కాదని, దేశఆర్థిక సమీకరణకు ఒక నూతన దిశనిచ్చిన మార్గదర్శకంగా నిలుస్తున్నది. పన్ను చెల్లింపు దారులు, వ్యాపారులు, పాలకులు, ప్రజలందరూ ఈ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చుకోవాలన్న సంకల్పంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పన్నుల వ్యవస్థను నడిపించేలా జీఎస్టీ కౌన్సిల్ ఇప్పటి వరకు 55కి పైగా సమావేశాలు నిర్వహించింది. ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవడానికి ఈ వేదిక సహకారాన్ని పెంపొందించడమే కాకుండా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక అవసరాలను తీర్చేలా వీలు కల్పించింది.జీఎస్టీ పన్ను వ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చినప్పటికీ రేట్ల సరళీకరణ, కాంప్లయన్స్ లోపాలను పరిష్కరించడం, ఐటీ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి సవాళ్లు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ, ఈ వ్యవస్థ మరింత సమర్థవంతమైన, ఏకీకృత, పారదర్శక పన్ను విధానానికి పునాది వేస్తుంది




విశ్లేషణ

..: దశ, స్టేట్ బ్యూరో :..

## నా మాటల్ని అపార్థం చేసుకోవద్దని కోరుతున్నాను: శిరీష్ రెడ్డి





తెలుగు సినీ ప్రేక్షకులకు, మెగా అభిమానులకు నమస్కారం. మా ఎస్వీసీ సంస్థకు, రామ్ చరణ్ గారికి, చిరంజీవి గారికి ఎంతో అవినాభావ సంబంధం ఉంది. చరణ్ గారికి నాకు మంచి అనుబంధం ఉంది. నేను అభిమానించే హీరోల్లో రామ్ చరణ్ గారు ఒకరు. ఆయన్ని అవమానపరచడం గాని, కించపరచడం గాని నా జన్మలో ఎప్పుడూ చేయను. నేను ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన గురించి చిన్న మాట దొర్లినా అది నా తప్పే. అది జరిగిందని అభిమానులు అనుకుంటున్నారు కాబట్టి నిజంగానే క్షమాపణలు చెబుతున్నాను. చరణ్ గారికి కూడా క్షమాపణలు చెబుతున్నాను. చరణ్ గారితో నాకు ఉన్నటువంటి రిలేషన్‌షిప్‌ను పాడుచేసుకోదల్చుకోలేదు. ఈరోజు జనం మాట్లాడుకుంటున్న మాటలు, బయట ట్రోలింగ్, అభిమానుల బాధలు నేను అర్థం చేసుకోగలను. ఎందుకంటే ఒక హీరోని అలా అన్నప్పుడు ఎవరూ భరించలేరు. నేను అన్న ఇంటెన్షన్ అది కాదు. మాకున్న రిలేషన్‌షిప్ క్లోజ్‌నెస్‌లో నేను మాట దొర్లాను తప్పా ఆయన్ని అవమానపరచడానికి కాదు. మెగా హీరోలందరితోనూ మాకు మంచి అనుబంధం ఉంది. వరుణ్ తేజ్ గారితో 'ఫిదా' చేశాం. సాయితేజ్ గారితో రెండు సినిమాలు చేశాం. చరణ్ గారితో రెండు సినిమాలు చేశాం. చిరంజీవి గారు దిల్ రాజు గారితో, మాతో మాట్లాడుతూనే ఉంటారు. ఇంత మంచి అనుబంధం ఉన్నవారిని అవమానపరిచే అంత మూర్ఖుడిని కాదు. దయచేసి అభిమానులందరూ అర్థం చేసుకోవాలి. సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' చరణ్ గారు ఒప్పుకోకపోతే ఆ సినిమా రిలీజ్ అయ్యేది కాదు. ఆయన మనసు గొప్పది కాబట్టి ఆ సినిమాను కూడా రిలీజ్ చేసుకోండి అని ఒక గొప్ప మనసుతో ఒప్పుకున్న వ్యక్తి చరణ్ గారు. ఆయన్ని ఎందుకు అవమాన పరుస్తాం. నా మాటల్ని అపార్థం చేసుకోవద్దని కోరుతున్నాను. ఫ్యాన్స్ కి క్షమాపణలు చెబుతున్నాను. దయచేసి మా రిలేషన్‌ను పాడు చేయొద్దు. మళ్లీ నెక్స్ట్ ఒక ప్రాజెక్టు రెడీ అయింది. నెక్స్ట్ చరణ్ గారితో సినిమా తీయబోతున్నాను. మా ఇద్దరి మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలు తీసుకురావద్దని అందర్నీ వేడుకుంటున్నాను. తెలుగు ప్రజలందరూ కూడా గమనించాలి. నాకు చరణ్ గారితో మంచి రిలేషన్ ఉంది. ఆయన గురించి నేను ఎప్పుడూ తప్పుగా మాట్లాడను. నేను ఫస్ట్ ఇంటర్వ్యూ ఇచ్చాను కాబట్టి, నాకు తెలియకుండా ఏదైనా మాట దొర్లిందేమో. అది కూడా అర్థం చేసుకోవాలని అందరిని కోరుతున్నాను. థాంక్యూ వెరీ మచ్.